



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం


02-09-2025

పేజీలు: 02


## కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా

# సీబీఐ దర్యాప్తు చేయకూడదు

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించింది. కాళేశ్వరం కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేయకూడదని హైకోర్టు తేల్చి చెప్పింది. దీనిపై తదుపరి విచారణ అక్టోబర్ 7కు వాయిదా వేసిన వేసింది హైకోర్టు. హైకోర్టులో ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ కీలక వాదనలు వినిపించారు. కాళేశ్వరం కేసును సీబీఐకి ఇస్తున్నామన్న ఏజీ.. కమిషన్‌తో సంబంధం లేకుండా సీబీఐ దర్యాప్తు చేస్తుందని చెప్పారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేపడుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లకు విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 7కి వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు




ఆదేశించింది. వెకేషన్ తర్వాత పూర్తి వాదనలు వింటామన్న హైకోర్టు స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగానే సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానించింది. దీనిపై విచారించిన కోర్టు.. కమిషన్ రిపోర్టును ఆధారంగా చేసుకోవద్దని తెలిపింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు ఉండదని న్యాయవాదులు తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు ఇప్పుడు స్కోప్ లేదని కేసీఆర్, హరీష్‌రావు తరపు న్యాయవాదులు చెబుతున్నారు. అయితే, కేవలం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు చెప్పిందే కాని.. అసలు సీబీఐ దర్యాప్తు వద్దని చెప్పాలేదంటున్నారు ప్రభుత్వ న్యాయవాదులు. హైకోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకోవద్దంటున్నారు.

**కాళేశ్వరం కేసు విచారణకు సీబీఐకి లైన్ క్లియర్!**

మరోవైపు కాళేశ్వరం కేసు విచారణకు సీబీఐకి లైన్ క్లియర్ అయ్యింది. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకతవకలపై సీబీఐ చేసే విచారణకు పూర్తిగా సహకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సీబీఐకి రాష్ట్రంలోఎంట్రీ లేకుండా 2022 ఆగస్ట్ 30నాటి ఉత్తర్వులకు మినహాయింపు ఇస్తున్నట్లు జీవో విడుదల చేసింది. కాళేశ్వరం కేసు వరకు సీబీఐకి సడలింపు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది సర్కార్. సెక్షన్ 6 క్లాస్ 2 పోలీస్ యాక్ట్ నోటిపై చేసింది రాష్ట్ర ప్రభుత్వం. సీబీఐ విచారణ ను రాష్ట్రంలోకి అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది.

**కేసీఆర్, హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవొద్దు అని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 7వ తేదీన ప్రధాన పిటిషన్ విచారణ ఉన్నందున దసరా సెలవుల అనంతరం తదుపరి విచారణ ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. అప్పటి వరకు కమిషన్ ఆధారంగా కేసీఆర్, హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవొద్దని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిన తెలంగాణ హైకోర్టు.



## ఎమ్మెల్సీ కవితపై బీఆర్ఎస్ వేటు.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రకటన

అంతా ఊహించిందే జరిగింది. బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేసేందుకు పార్టీ అధినేత , కవిత తండ్రి కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో పార్టీ క్రమశిక్షణా కమిటీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ ఆదేశాలతో నిర్ణయం తీసుకున్నట్లు సోమభరత్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలం నుంచి కవిత వ్యవహారం పార్టీకి నష్టం చేకూర్చేలా ఉందని బీఆర్ఎస్ నుంచి ఆమెపై వేటు వేశారు. కవిత చేసే వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఎమ్మెల్సీ కవిత బిఆర్ ఎస్ లో కొనసాగుతూనే గత కొంత కాలంగా పార్టీకి వ్యతిరేకంగా మాట్లడుతున్నారు. ఏకంగా తన తండ్రి , బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని ప్రశ్నించే స్థాయిలో ఆమె కామెంట్స్ పీక్స్ కు చేరుకున్నాయి. పార్టీలు దేయ్యాలు కేసీఆర్ ను నడిపిస్తున్నాయంటూ మొదలైన కవిత ధిక్కార స్వరం , అక్కడితో ఆగలేదు.. అనేకసార్లు పార్టీ విధానాలపై, పార్టీలో కీలక నేతలపైన తీవ్ర స్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ వచ్చారు. తన తండ్రి దేవుడు అంటూనే ,కేసీఆర్ కు నమ్మిన బంటుగా ఉన్న నేతలపై విరుచుకుపడ్డారు.



## పవన్ కళ్యాణ్ బర్త్‌డే

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, స్టార్ నటుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదకగా పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అయితే పవన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. అగ్ర నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ స్పెషల్ మ్యాష్అప్ వీడియోను వదిలింది. పవన్ ఇప్పటివరకు చేసిన సినిమాలతో పాటు అతడి ఐకానిక్ సినిమాలలోని డైలాగ్‌లను, పవన్ పొలిటికల్ కెరీర్‌ను ఈ వీడియోలో జత చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## భారత్ విలువలు మాకు దగ్గరగా ఉంటాయి: అమెరికా



భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, దాని విలువలు మాకు దగ్గరగా ఉంటాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ అన్నారు. భారత్-అమెరికా బంధం బలమైన పునాదులపై ఉందన్నారు. ఇరుదేశాలు అభిప్రాయ భేదాలను పరిష్కరించుకొనే సత్తా ఉన్నవేనన్నారు. అయితే షాంఘై సహకార సదస్సు నాటకీయంగా ఉందని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని స్కాట్ బెసెంట్ విమర్శించారు.

## చెరువుల పునరుద్ధరణ వేగంగా జరగాలి

### హైడ్రా కమిషనర్

నగరంలోని చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అధికారులను ఆదేశించారు. మొదట విడత చేపట్లిన 6 చెరువుల పునరుద్ధరణ త్వరగా పూర్తి కావాలన్నారు. ఈ క్రమంలో ఇటీవల అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువులను సందర్శించిన హైడ్రా కమిషనర్ సోమవారం సున్నం చెరువును పరిశీలించారు. అలాగే నార్సింగ్ వద్ద సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) లో భాగంగా తత్వ రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన ముష్కి చెరువును కూడా సందర్శించారు. సున్నం చెరువులో డెబ్రీస్‌ను తొలగించే పనులను పర్యవేక్షించారు. చెరువులోకి వరద నీరు నేరుగా చేరేందుకు వీలుగా వెంటనే ఇన్‌లెట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువు పై భాగంలోని ప్రాంతాల్లో వరద సాఫీగా కిందకు సాగడంలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో చెరువు ఇన్‌లెట్ల పనుల ఆవశ్యకతను వివరించారు. అలాగే మురుగు కాలువ డైవర్షన్ పనులు కూడా పూర్తి కావాలన్నారు. ఈ వర్షాకాలంలోనే చెరువుల పునరుద్ధరణ జరగాలని సూచించారు.






## ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్.. 10 జిల్లాల్లో పాఠశాలలు మూసివేత

ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వాగులు, వంకలు, నదులు ప్రమాదకరస్థాయిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ అలర్ట్ ఇచ్చింది. ఐఎండీ అలర్ట్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు. అనేక జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పలు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. క్లౌడ్‌బరస్ట్‌లు, ఆకస్మిక వరదల దృష్ట్యా పౌరి గర్వాల్, ఉత్తరకాశి, చమోలి, రుద్రప్రయాగ్, నైనిటాల్, ఉధమ్‌సింగ్ నగర్, అల్మోరా, చంపావత్, పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని 12వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. అనేక చోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొండచరియలు విరిగిపడటంతో అనేక రోడ్లు బ్లాక్ అయ్యాయి. కాంచన్ గంగా, భనేర్పాని, కామెడ, థానా ధరాలి ప్రాంతంలోని అనేక మార్గాలను మూసివేసినట్లు చమోలి పోలీసులు తెలిపారు. మరోవైపు పరిస్థితి ప్రమాదకరంగానే ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

## హాట్‌గా భాగ్యశ్రీ

నేచురల్ స్టార్ నాని నటించనున్న 'ది ప్యారడైజ్' చిత్రానికి సంబంధించిన కాస్టింగ్ పనులు ఊపందుకున్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం ఈ సినిమాలో నాని సరసన నటించేందుకు తగ్గ హీరోయిన్ కోసం పరిశీలన జరుపుతున్నాడు. ఈ క్రమంలో భాగ్యశ్రీ బోర్సేను హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలు టాప్ యంగ్ హీరోల పక్కన నటిస్తున్న ఆమెకి మంచి క్రేజ్ ఉండటంతో, ఈ క్రేజ్ తమ సినిమాకి బలంగా ఉపయోగపడుతుందని మేకర్స్ భావిస్తున్నారట. త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుందని ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి.





## ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఏపీపీఎస్సీ శుభవార్త

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఏపీపీఎస్సీ శుభవార్త అందించింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 80 పోస్టుల భర్తీకి త్వరలోనే 20 నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో వేలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాల జాప్యంపైనా స్పష్టత ఇచ్చింది. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉన్నందున, ఈ ప్రకటనలన్నింటికీ కలిపి ఒకే ఉమ్మడి పరీక్ష నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు.గ్రూప్-1, గ్రూప్-2 తుది ఫలితాల జాప్యంపై రాజాబాబు మాట్లాడుతూ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల తుది జాబితా ఇంకా అందకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఆ జాబితా అందిన వెంటనే ఫలితాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా మినహా మిగిలిన ప్రక్రియ మొత్తం పూర్తయిందని తెలిపారు. అలాగే గ్రూప్-2కు సంబంధించి 1,634 మంది అభ్యర్థుల కంటిచూపు, 24 మంది వినికిడి సామర్థ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు కూడా రావాల్సి ఉందని వివరించారు. ఫలితాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఇక అటవీ శాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి మాట్లాడుతూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఈ నెల 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రాజాబాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 287 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై వివరాలను జాగ్రత్తగా నింపాలని, వైట్‌నర్ వాడినా లేదా సమాధానాలు చెరిపివేసినా ఆ పత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించారు. ప్రతి మూడు తప్పు సమాధానాలకు ఒక నెగటివ్ మార్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## 'సైయారా' కొత్త రికార్డు.. వరల్డ్ వైడ్‌గా రూ.581 కోట్లు

బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం సైయారా (Saiyaara). ఈ సినిమాకు మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు. ఆషిఖీ 2, ఎక్ విలన్ వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత మోహిత్ సూరి దర్శకత్వంలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే జూలై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆ అంచనాలను అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. మొదటిరోజు నుంచే భారీ కలెక్షన్లు రాబడుతున్న ఈ చిత్రం తాజాగా రూ.581 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టినట్లు చిత్రబృందం యష్‌రాజ్ ఫిలిమ్స్ ప్రకటించింది. ఈ సందర్భంగా సరికొత్త రికార్డును అందుకుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా ఈ సినిమా నిలిచింది. కేవలం ఇండియాలోనే రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించగా.. వరల్డ్ వైడ్‌గా రూ.169 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ కోసం ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.



## పెళ్లైన 13 ఏళ్లకి ప్రెగ్నెంట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సూపర్ హిట్ సినిమాల్లో జల్సా చిత్రం ఒకటి. ఈ మూవీ త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కగా ఇందులోని పవర్ ఫుల్ డైలాగ్స్ ప్రేక్షకులకి పూనకాలు తెప్పించాయి. యుద్ధంలో గెలవడమంటే శత్రువును చంపటం కాదు శత్రువును ఓడించటం అంటూ పవన్ చెప్పిన డైలాగ్స్ కి థియేటర్ హోరెత్తిపోయింది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌కి జంటగా ఇలియానాతో పాటు పార్వతీ మెల్టన్ నటించింది. పార్వతి 2005లో వచ్చిన వెన్నెల అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం కాగా, ఆ తర్వాత గేమ్, అల్లరే అల్లరి,మధుమాసం సినిమాలు చేసింది. కానీ ఈ సినిమాలు ఏవి పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. తాజాగా పార్వతి మెల్టన్ తన బేబీ బంప్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా, ఇవి చూసిన నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. బేబి బంప్‌లోను మరీ ఇంత హాట్ గా ఫొటో షూట్ చేయాలా అని అంటున్నారు. మరి కొందరు కాబోయే మామ్ కి కంగ్రాట్స్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఇటీవల తన కెరీర్ పై పార్వతి ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన కెరీర్ పాడవడానికి కారణం ఇద్దరు డైరెక్టర్స్ అని చెప్పుకొచ్చిన ముద్దుగుమ్మ వారి పేర్లు మాత్రం చెప్పలేదు. కాని అప్పట్లో కొంతమంది డైరెక్టర్ల పేర్లు వినిపించాయి.ఆ డైరెక్టర్లు ఎవరో సినీ ఇండస్ట్రీ గురించి తెలిసిన చాలా మందికి తెలుసు అని పేర్కొంది.


## కర్నూలు నగరంలో రెండు హత్యలు నగరవాసుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తించాయి

కర్నూలు నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న రెండు హత్యలు నగరవాసుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తించాయి. ఒకవైపు బంగారు షాపు యజమాని షేక్ ఇజ్‌హార్ అహ్మద్‌పై దుండగులు కత్తులతో దాడి చేయగా, మరోకవైపు వృద్ధురాలు శివలీలను హత్య చేసి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనలు కలకలం సృష్టించాయి.ఎన్ఆర్‌పేటకు చెందిన షేక్ ఇజ్‌హార్ అహ్మద్ (42) నగరంలో బంగారు వ్యాపారిగా కొనసాగుతున్నారు. సోమవారం సాయంత్రం రాధాకృష్ణ టాకీస్ సమీపంలోని మసీదు వద్ద ప్రార్థనల అనంతరం బయటకు వచ్చిన ఆయనపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ముఖం, ఛాతీపై విచక్షణారహితంగా పొడవడంతో పాటు, కుడి చేతిని పూర్తిగా నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఇజ్‌హార్‌ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు.ఇజ్‌హార్‌కు ఇటీవల పాతబస్తీలోని ఘనిగల్లీకి చెందిన మాజీ కార్పొరేటర్ కుమారులు ఇమ్రాన్, ఇర్ఫాన్‌లతో గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు వారి ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.గణేశ్‌నగర్ పరిధిలోని సాయివైభవ్ నగర్‌లో నివాసముండే 75 ఏళ్ల వృద్ధురాలు కాటసాని శివలీలను గుర్తు తెలియని దుండగులు హత్య చేసి బంగారు



ఆభరణాలు అపహరించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె తలపై గట్టిగా కొట్టి చంపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.శివలీల భర్త సాంబశివారెడ్డి కొంత కాలం క్రితం మరణించగా, కుమారుడు గంగాధర్ రెడ్డి అమెరికాలో ఉంటున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగి అయిన అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి ఆమెకు తోడుగా ఉంటున్నారు.అల్లుడు చంద్రశేఖర్‌రెడ్డి నిన్న ఇంటికి వచ్చేసరికి ఆమె డైనింగ్ హాలులో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. శరీరంపై గాయాలు, మెడలో గొలుసు, చేతికి బంగారు గాజులు లేకపోవడంతో ఇది దొంగతనం నిమిత్తం చేసిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన పాక్ బ్యాటర్ అసిఫ్ అలీ



పాకిస్థాన్ బ్యాటర్ ఆసిఫ్ అలీ.. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. 33 ఏళ్ల ఆ క్రికెటర్ పాకిస్థాన్ తరపున 58 టీ20 మ్యాచ్‌లు, 21 వన్డేలు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 959 రన్స్ చేశాడు. దీంట్లో మూడు సెంచరీలు ఉన్నాయి. చివరి సారి అతను 2023 ఆసియా గేమ్స్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2022, 2021 పాక్ టీ20 వరల్డ్‌కప్ జట్టులో అతను ఆడాడు. పాకిస్థాన్ జెర్సీ ధరించడం గొప్ప గౌరవంగా భావిస్తానని, దేశం తరపున ఆడడం గర్వంగా ఫీలవుతున్నట్లు తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. 2018 ఏప్రిల్‌లో వెస్టిండీస్ తో జరిగిన టీ20లో అరంగేట్రం చేశాడు. ఆ ఏడాది పాక్ లీగ్ క్రికెట్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టు టైటిల్ గెలుచుకున్నది. ఫైనల్లో చేజింగ్ చేస్తూ ఓ దశలో వరుసగా హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో అతన్న వన్డే జట్టులోకి తీసుకున్నారు. దేశవాలీతో పాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న లీగ్ క్రికెట్‌లో ఆడనున్నట్లు అసిఫ్ అలీ పేర్కొన్నాడు.



## భారత్-యూఏఈ మధ్య చమురేతర వాణిజ్యంపై ప్రత్యేక దృష్టి

భారత్, యూఏఈ ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని సమీక్షించిన అనంతరం, 2030 నాటికి చమురేతర ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని సమున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. మారుతున్న ప్రపంచ వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.గత వారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జెయొూదీ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీ వివరాలను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'సెపా' ఒప్పందం కింద సాధించిన ప్రగతిని మంత్రులిద్దరూ సమీక్షించారు. భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సరఫరా గొలుసు, ఆరోగ్య సంరక్షణ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో కలిసి పనిచేయాలని అంగీకారానికి వచ్చారు.వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసేందుకు స్థానిక కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్ (రూపాయి-దిర్హామ్), యూఏఈలో 'భారత్ మార్ట్' ఏర్పాటు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఇరు దేశాల మంత్రులు అభిప్రాయపడ్డారు. వాణిజ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా 'సెపా' పర్యవేక్షణను మెరుగుపరచాలని నిర్ణయించారు. భారత ఫార్మా కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూఏఈలో కొత్తగా ఏర్పాటైన 'ఎమిరేట్స్ డ్రగ్ ఎస్టాబ్లిష్‌మెంట్' కీలక పాత్ర పోషిస్తుందని భారత ప్రతినిధి బృందం ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ సమావేశంలో భాగంగా ఫార్మా, ఆహార రంగాల ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. భారత ఫార్మా ఉత్పత్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతం చేస్తామని యూఏఈ మంత్రి హామీ ఇచ్చారు.

## మృణాల్ హాట్ లుక్

సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు చాలా మందిని వెంటాడుతున్న సమ్యసల్లో డిప్రషన్ ఒకటి. చాలా మంది సినీ సెలబ్రెటీలు చాలా మంది డిప్రషన్ సమస్యను ఎదుర్కొన్నారు. కొంతమంది సినిమాల విషయంలో.. మరికొంతమంది రిలేషన్స్ షిప్స్ విషయంలో డిప్రషన్ లోకి వెళ్లారు. కొంతమంది డిప్రషన్ నుంచి బయట పడ్డారు.. మరికొంతమంది మాత్రం డిప్రషన్ వల్ల కెరీర్ కోల్పోయారు.. మరికొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయారు.సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు చాలా మందిని వెంటాడుతున్న సమ్యసల్లో డిప్రషన్ ఒకటి. చాలా మంది సినీ సెలబ్రెటీలు చాలా మంది డిప్రషన్ సమస్యను ఎదుర్కొన్నారు. కొంతమంది సినిమాల విషయంలో.. మరికొంతమంది రిలేషన్స్ షిప్స్ విషయంలో డిప్రషన్ లోకి వెళ్లారు. కొంతమంది డిప్రషన్ నుంచి బయట పడ్డారు.. మరికొంతమంది మాత్రం డిప్రషన్ వల్ల కెరీర్ కోల్పోయారు.. మరికొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయారు.



## ఐటీ కారిడార్‌లో త్వరలోనే 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ప్రజా రవాణా సేవలను మరింతగా విస్తరిస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ఐటీ కారిడార్‌లో ప్రస్తుతం 200 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తుండగా.. త్వరలోనే మరో 275 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ), అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్ మెంట్ కౌన్సిల్(టీఎఫ్ఎంసీ) సంయుక్తంగా ఐటీ కారిడార్‌లో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనపై సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాయి. హైదరాబాద్ హైటెక్ సిటీలోని టెక్ మహీంద్ర క్యాంపస్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఈ సమావేశంలో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఐటీ కారిడార్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగుల రవాణా అవసరాలకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఐటీ కంపెనీలకు అద్దెకు బస్సులను ఇచ్చే సదుపాయాన్ని కల్పించామని వెల్లడించారు. ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మెట్రో డీలక్స్ బస్సులను అద్దెకు ఇస్తున్నామని, ఐటీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రైవేట్ వాహనాల వినియోగం వల్ల ఐటీ కారిడార్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవడం ఒక్కటే ట్రాఫిక్ నివారణకు ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతి ఐటీ సంస్థ కూడా ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించాలని, ఉద్యోగులకు ఆ దిశగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకునే ఉద్యోగులకు ప్రోత్సహకాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

